
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



సంగారెడ్డి 5 మెదక్ జిల్లాల వార్తలు

శనివారం 1 మార్చి 2025

నర్సాపూర్‌లో ఏఐ విద్యపై మెదక్ కలెక్టర్ ఆరా

నర్సాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): నర్సాపూర్ పట్టణంలోని ఎంపీపీఎస్-2లో ఏఐ ఆధారిత తరగతులను శుక్రవారం కలెక్టర్ రాహుల్‌రాజ్ పరిశీలించారు. విద్యార్థులతో మాట్లాడి తెలుగు, గణిత సామర్థ్యాలను, కంప్యూటర్ ద్వారా నేర్చుకుంటున్న అంశాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో ఎంఈవో తారాసింగ్, హెచ్‌ఎం మక్సూద్, ఉపాధ్యాయులు గణేష్, సరిత, రవి, కిష్టయ్య, సీఆర్‌పీలు నర్సింహాచారి, భైరవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



గర్భగుడిలో పూజలందుకుంటున్న వనదుర్గామాత

ఏడుపాయల క్షేత్రం వీధుల్లో రథం లాగుతున్న భక్తులు

(కింది ఫొటోలో) రథం ముందు పట్టుపరిచి వ్రతం పోసిన 18 రకాల వృత్తి పనివారు



వనదుర్గకు వైభవంగా రథోత్సవం

- వేలాదిగా తరలివచ్చిన భక్తులు
- జయజయ ధ్వానాల మధ్య రథాన్ని లాగిన భక్తులు
- మూడో రోజూ జాతర సందడి

7వ పేజీ

చికెన్ మేళా.. ఎగబడ్డ జనం

నర్సాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చికెన్, ఎగ్ మేళాకు జనం ఎగబడ్డారు. బర్డ్ ఫ్లూపై ప్రజల్లో ఉన్న అపోహలు పోగొట్టడానికి వెన్‌కాబ్ చికెన్ కంపెనీ సహకారంతో నర్సాపూర్‌లో ఓ చికెన్ సెంటర్ యాజమాన్యం శుక్రవారం సాయంత్రం ఉచిత చికెన్, ఎగ్స్ మేళా నిర్వహించింది. మూడు క్వింటాళ్ల చికెన్‌ఫ్రై, 3వేల ఉడకబెట్టిన గుడ్లను పంపిణీ చేసింది. ఎమ్మెల్యే సునీతారెడ్డి, మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ నయిమొద్దీన్ హాజరై చికెన్ వంటకాలను రుచి చూశారు. చికెన్‌ను ఉడికించి తినడంతో ఎటువంటి ప్రమాదం లేదని ఆమె సూచించారు.



నర్సాపూర్‌లో చికెన్ తింటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి



చికెన్, ఎగ్ మేళాకు వచ్చిన జనం

అభివృద్ధి పథంలో డీసీసీబీ

- పదేళ్లలో నాలుగింతలు పెరిగిన టర్నోవర్
- రైతులకు అన్నిరకాల రుణాలు
- ప్రతీ మండల కేంద్రంలో బ్యాంక్ బ్రాంచ్ ఉండాలన్నదే ధ్యేయం
- డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్‌రెడ్డి



చిట్టి దేవేందర్‌రెడ్డి

ఫటా ఫట్

కొండపాక, ఫిబ్రవరి28 (ఆంధ్రజ్యోతి) : పదేళ్ల పదవీ కాలంలో డీసీసీబీ బ్యాంకును రూ.450కోట్ల నుంచి రూ.2450 కోట్లకు టర్నోవర్ చేసి రైతులకు అన్నిరకాల రుణాలు అందిస్తూ అండగా నిలిచామని డీసీసీబీ చైర్మన్ చిట్టి దేవేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో డీసీసీబీ బ్యాంకు బ్రాంచ్ ఏర్పాటుకు కృషి చేయనున్నట్లు ఆయన ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో తెలిపారు.

పదేళ్లలో మీరు చేసిన అభివృద్ధి?

నేను 2015లో డీసీసీబీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు చేపట్టాను. రెండోసారి డీసీసీబీ చైర్మన్‌గా కొనసాగుతున్నాను. బాధ్యతలు చేపట్టిన సమయంలో రూ.450 కోట్ల టర్నోవర్ మాత్రమే ఉన్నది. ప్రస్తుతం అది రూ.2450 కోట్ల టర్నోవర్‌తో నడుస్తుంది.

బ్యాంకు అభివృద్ధికి మీరు చేసిన కృషి?

డీసీసీబీని అభివృద్ధిపథంలో నడపడంతో ఉద్యోగుల సమష్టి కృషి ఎంతో ఉంది. పదేళ్ల క్రితం 150 మందితో ఉన్న ఉద్యోగులు ప్రస్తుతం 350 మంది పనిచేస్తున్నారు. వీరందరి సమష్టి కృషితో బ్యాంకును అభివృద్ధిలో తీసుకెళ్తున్నాం.

ప్రస్తుతం ఎన్ని బ్రాంచీలు?.. ఇంకేమైనా ప్రారంభిస్తారా?

70 సంవత్సరాల్లో డీసీసీబీ ఆధ్వర్యంలో 23 బ్రాంచ్‌లు మాత్రమే ఉన్నాయి. ఈ పదేళ్లలో వాటిని 49 బ్రాంచులకు పెంచాం. సీఎం రేవంత్‌రెడ్డి సహకారంతో ప్రతి మండల కేంద్రంలో బ్యాంకును ఏర్పాటు చేయాలన్నదే ప్రధాన లక్ష్యం. 10 పక్కా భవనాలతో బ్యాంకులు నడుస్తున్నాయి. ఇందులో గతంలో మూడు భవనాలు మాత్రమే ఉండేవి. ఈ రోజుకు పది సొంత భవనాలను ఏర్పాటు చేశాం. భూంపల్లి, మెదక్, వెల్దుర్తి, పటాన్‌చెరు, నారాయణఖేడ్, ఝరాసంగంలలో కొత్త భవనాలను ఏర్పాటు చేశాం.

మీ బ్యాంకు ద్వారా ఎలాంటి రుణాలు అందిస్తున్నారు?

గతంలో ఎల్‌టీ, క్రాప్ లోన్స్, గోల్డ్ లోన్స్ మాత్రమే ఉండేవి. ఇందులో అప్పుడు గోల్డ్ లోన్స్ రూ.25 కోట్లు మాత్రమే టర్నోవర్ ఉండగా ప్రస్తుతం రూ.327 కోట్ల టర్నోవర్‌కు చేరుకుంది . కొత్తగా మహిళా గ్రూపులకు రూ.456 కోట్ల రుణాలను అందజేసి వారిలో ఆర్థిక పరిపుష్టికి బ్యాంకు అండగా నిలిచింది. గతంలో ఇంటి రుణాలను ఇవ్వలేదు. ప్రస్తుతం రూ.111కోట్ల ఇంటి రుణాలను అందజేశాం. ప్రతి రైతు సొంత ఇల్లు కట్టుకోవాలని ఉద్దేశంతో వారికి బ్యాంకు అండగా నిలుస్తుంది. ఇంటి నిర్మాణం కోసం ఎకరాకు రూ. 6.40లక్షలు రుణంగా అందజేస్తున్నాం.

రైతులకు ఎలాంటి రుణాలు అందజేస్తున్నారు?

రైతునేస్తం కింద ఎకరానికి రూ.3లక్షలు, స్వయంకృషి కింద రూ.50 వేల నుంచి రూ.2లక్షల వరకు, పౌల్ట్రీ, ట్రాక్టరు, కారు, జేసీబీ, బైకు లాంటి వాటికి రుణాలు అందిస్తున్నాం. ల్యాండ్ డెవలప్మెంట్ కూడా రుణం ఇస్తున్నాం. కేవలం అరగంటలోనే గోల్డ్ లోన్ అందజేస్తున్నాం. రైతుల పిల్లల ఉన్నత చదువుల కోసం రూ.25 లక్షల వరకు రుణం అందజేస్తున్నాం. డీసీసీబీ అన్ని ఆన్‌లైన్ సేవలను అందిస్తుంది. ఫోన్ పే, గూగుల్ పే నెట్ బ్యాంకింగ్ లాంటి సేవలను కూడా అందిస్తుంది.

కబ్జా చెరలో ఆలయ భూమి

- రిజిస్ట్రేషన్ అయిందంటూ దబాయింపు
- గతంలోనూ పలుమార్లు యత్నం

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మెదక్ జిల్లా కేంద్రంలో ఆలయ భూమి మరోసారి కబ్జాకు గురైంది. గతంలోనూ పలుమార్లు ఈ భూమిని కబ్జా చేసేందుకు యత్నించగా 'ఆంధ్రజ్యోతి' కథనాలతో రెవెన్యూ యంత్రాంగం స్పందించి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డును ఏర్పాటు చేశారు. కానీ, పట్టువదలని విక్రమార్కుల్లా మరోసారి కడీలు పాతి భూమిని స్వాధీనం చేసుకునేందుకు కొందరు యత్నిస్తున్నారు. పట్టణంలోని శిశుమందిర్ ప్రాంగణంలో ఉన్న వేణుగోపాలస్వామి ఆలయానికి 1128 సర్వే నంబర్‌లో 11వ వార్డు పరిధిలో 1.03 ఎకరాల భూమి ఉంది. ఐదేళ్ల క్రితం ఈ భూమిని కబ్జాచేసి భవన నిర్మాణాలు చేపట్టేందుకు కొంతమంది ప్రయత్నించారు. దీనిపై 'ఆంధ్రజ్యోతి'లో కథనాలు రావడంతో అప్పటి మున్సిపల్ చైర్మన్, అధికారులు స్పందించి నిర్మాణాలను నిలిపివేయించారు. మరికొంత కాలానికి మరొకరు సదరు స్థలంలో ఇంటి నిర్మాణాల పిల్లర్లను సైతం నిర్మించగా.. మరోసారి 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో, రెవెన్యూ అధికారులు ఇది ప్రభుత్వ భూమి అని తెలిసేలా బోర్డును సైతం ఏర్పాటు చేశారు.

అర్ధరాత్రి హద్దురాళ్లు

వేణుగోపాల స్వామి ఆలయం భూమిని కబ్జా చేసేందుకు మరోసారి ప్రయత్నాలు ప్రారంభమయ్యాయి. గురువారం అర్ధరాత్రి కొందరు వ్యక్తులు ఆలయ భూమిలో 300 గజాల స్థలం చుట్టూ కడీలు పాతి స్వాధీనం చేసుకున్నారు. చుట్టుపక్కలవారు ప్రశ్నిస్తే ఈ భూమి తమదేనని, తమ పేరిట రిజిస్ట్రేషన్ అయిందని దబాయించారు. ఈ వ్యవహారంపై రెవెన్యూ, మున్సిపల్ అధికారులు స్పందించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. భూమి చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయించాలని కోరుతున్నారు.



వేణుగోపాలయ స్వామి ఆలయ భూమిని కబ్జాచేసి పాతిన హద్దురాళ్లు

దేవాదాయశాఖకు అప్పగించాం

మెదక్ పట్టణంలోని వేణుగోపాల స్వామి ఆలయానికి సంబంధించిన భూమిని కబ్జా చేసినట్టు ఫిర్యాదుల రావడంతో గతంలో సర్వే నిర్వహించాం. 1128 సర్వే నంబర్‌లో 1.03 ఎకరాల స్థలం ఉన్నట్లు గుర్తించి సర్వే రికార్డు, నక్షతోపాటు పూర్తి ఆధారాలను దేవాదాయశాఖ అధికారులకు అంప్పగించాం. ప్రస్తుతం సదరు స్థలం దేవాదాయశాఖ పర్యవేక్షణలోనే ఉంది.

-లక్ష్మణ్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, మెదక్

ఆలయ భూమి కబ్జా చేస్తే సహించేది లేదు

వేణుగోపాలస్వామి ఆలయానికి చెందిన భూమిని గతంలో కొంతమంది కబ్జా చేసేందుకు యత్నించగా రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టి ఎండోమెంట్ అధికారులకు అప్పగించారు. ప్రస్తుతం మరోసారి ఇదే భూమి కబ్జా అయిన విషయం మాకు తెలియదు. కబ్జాకు పాల్పడింది ఎవరైనా సరే ఊరుకునేది లేదు. కబ్జా చేసి పాతిన హద్దురాళ్లను నేనే స్వయంగా తొలగించి ఆలయ భూమిని కాపాడుతా. అధికారులు కూడా ఆలయభూమి మాటిమాటికీ కబ్జాకు గురవకుండా తగిన చర్యలు తీసుకోవాలి.

- సమీయొద్దీన్, మాజీ కౌన్సిలర్

ఇంటర్ పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మెదక్ జిల్లాలో 30 కేంద్రాలు, 12,484 మంది విద్యార్థులు

మెదక్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో మార్చి 5 నుంచి ఏప్రిల్ 23 వరకు జరగనున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఇంటర్ పరీక్షల ఏర్పాట్లపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పరీక్షల నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగే పరీక్షలకు జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 30 సెంటర్లల్లో 12,484 మంది విద్యార్థులు హాజరవుతారని వెల్లడించారు. ప్రశ్నపత్రాల స్టోరేజీకి పాయింట్లు ఏర్పాటు చేశామని తెలియజేశారు. చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఫ్లయింగ్ స్క్వాడ్స్, సిట్టింగ్ స్క్వాడ్స్, ఇన్విజలేటర్స్‌ను నియమించామని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద బీఎన్ఎస్(163) సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. సీసీ కెమెరాల పర్యవేక్షణలో పేపర్ల తనిఖీ నిర్వహించాలని సూచించారు. విద్యార్థుల సమయానికి అనుగుణంగా బస్సులు నడపాలని ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

మూడు విడతలు.. 11 అంశాలు

కొత్త టీచర్లకు శిక్షణ షురూ

సంగారెడ్డి అర్బన్/మెదక్ అర్బన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : డీఎస్సీ-2024 ద్వారా నియమితులైన కొత్త ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలని విద్యాశాఖ నిర్ణయించింది. వివిధ అంశాలపై తర్ఫీదు ఇచ్చేందుకు వీలుగా మూడు దశల్లో శిక్షణకు ఏర్పాట్లు చేశారు. సంగారెడ్డి జిల్లాలో 417 మంది, మెదక్ జిల్లాలో 271 ఉపాధ్యాయులు ఇటీవల నియమితులయ్యారు. వీరికి శిక్షణ ఇచ్చేందుకు విద్యాశాఖ ప్రత్యేక కార్యాచరణ రూపొందించింది. మొదటి దశలో శుక్రవారం ప్రారంభమైన ఎస్జీటీల శిక్షణ కార్యక్రమం మార్చి 3 వరకు కొనసాగనున్నది. అనంతరం స్కూల్ అసిస్టెంట్లు, స్పెషల్ ఎడ్యుకేషన్ టీచర్లు, పీఈటీలకు వేర్వేరుగా ఈ నెలలోనే శిక్షణ ఇవ్వనున్నారు.

మొదటి విడతలో ఎస్జీటీలకు..

కొత్తగా చేరిన సెకండరీ గ్రేడ్ టీచర్లు సంగారెడ్డిలోని జిల్లా పరిధిలో 282 మంది, మెదక్ జిల్లా పరిధిలో 140 మందికి ఆయా జిల్లా కేంద్రాల్లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పాఠ్యపుస్తకాల సద్వినియోగం, తరగతి గది నిర్వహణ, విద్య, అభ్యసన, ప్రమాణాల పెంపు, పాఠ్యప్రణాళికలు, మూల్యాంకన పద్ధతులు, విధానాలు, ఐసీటీ, ఐఎఫ్‌పీ, డిజిటల్ బోధన, తొలి మెట్టు, ఉన్నతి తదితర కార్యక్రమాలపై శిక్షణ ఇస్తున్నారు. తొలి రోజు సంగారెడ్డి డీఈవో వెంకటేశ్వర్లు, మెదక్ డీఈవో రాధాకిషన్ శిక్షణ కార్యక్రమానికి హాజరై పలు విషయాలపై ఎస్జీటీలకు దిశానిర్దేశం చేశారు. బోధనకు పదును పెట్టేందుకుగాను శిక్షణ కార్యక్రమాలు దోహదపడతాయని పేర్కొన్నారు.

మార్చి 4 నుంచి ఉమ్మడి జిల్లా టీచర్లకు..


రెండో విడతలో భాగంగా ఉమ్మడి మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట జిల్లాల పరిధిలోని 330 మంది స్కూల్ అసిస్టెంట్లు, భాషా పండితులకు మార్చి 4 నుంచి 6వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఇందుకోసం మెదక్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల, జెడ్పీహెచ్ఎస్(రాజ్‌పల్లి)లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడో విడతలో స్పెషల్ ఎడ్యుకేషన్ పీఈటీలకు మార్చి 11 నుంచి 12 వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

11 అంశాల్లో శిక్షణ

నూతన ఉపాధ్యాయులకు 11 అంశాలల్లో శిక్షణ అందించనున్నారు. విద్యాప్రమాణాలు, ఎడ్యుకేషన్ యాప్, సమ్మెటివ్, ఫార్మెటివ్ పరీక్షలు, సంవత్సర పాఠ్యప్రణాళిక, యూడైస్, పాఠ్యపుస్తకాల సద్వినియోగం, సాంకేతిక వినియోగం, తొలిమెట్టు, డిజిటల్ పాఠాలు, లిప్ కార్యక్రమాల అమలు తదితర అంశాలపై డీఆర్పీలతో శిక్షణ ఇస్తున్నారు. శిక్షణకు ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ఒక్కో ఉపాధ్యాయునికి రూ.775 చొప్పున నిధులు విడుదలయ్యాయి.

ఆమె.. నేను.. అర్ధాంగిపై ప్రేమతో విగ్రహం

గుమ్మడిదల, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : భార్య తనను వదిలి అనంతలోకాలకు వెళ్లినా ఆమెపై ప్రేమతో విగ్రహం చేయించుకుని, అందులోనే ఆమెను చూసుకుంటూ గడుపుతున్నారు.



భార్య విగ్రహంతో సత్యనారాయణ

సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల గ్రామానికి చెందిన చెన్నంశెట్టి సత్యనారాయణ (70)కు నాగలక్ష్మితో 1974 మార్చి 1 వివాహం జరిగింది. 48 ఏళ్ల దాంపత్య జీవనం అనంతరం ఆమె 2022 ఫిబ్రవరి 5న మృతిచెందారు. ఆమెను మరిచిపోలేక సత్యనారాయణ భార్య విగ్రహాన్ని తయారు చేయించి ఇంట్లో పెట్టుకున్నారు. విగ్రహం కేవలం ఒక రూపమే కాదు, అది అతనికి ఒక భావోద్వేగం, ఒక ప్రాణం. ప్రతిరోజూ ఉదయం లేవగానే విగ్రహానికి నమస్కారం చేస్తారు. భోజన సమయంలో ఆమె కోసం ప్రత్యేకంగా పళ్లెంలో వడ్డిస్తారు. పండగలు, ప్రత్యేక సందర్భాల్లో విగ్రహాన్ని అలంకరిస్తారు. నేడు (మార్చి 1) వారి వివాహ వార్షికోత్సం జరుపుకొంటున్న చెన్నం శెట్టి సత్యనారయణకు ప్రజలు అభినందనలు తెల్పుతున్నారు.

తాగునీటి సమస్యను తీర్చిన దాత

● రెండు బోర్లు వేయించిన ప్రసాద్‌రెడ్డి

కోహీర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జాపూర్ గ్రామానికి చెందిన ప్రసాద్‌రెడ్డి తన సొంత డబ్బులతో బోర్లు వేయించి గ్రామంలో తాగు నీటి సమస్యను పరిష్కరించారు. గ్రామంలోని ఎస్సీ, బీసీ, కాలనీలో తాగునీటి ఇబ్బంది ఉండకూడదన్న ఉద్దేశంతో రెండు బోర్లను తవ్వించారు. ప్రసాద్‌రెడ్డి తవ్వించిన బోరుబావుల్లో పుష్కలంగా నీరు రావడంపై గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేస్తూ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.


జి.హుక్రాన సమీపంలో రహదారి పక్కన కాలిపోయిన మొక్కలు

కాలిపోయిన హరితహారం మొక్కలు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జి.హుక్రాన గ్రామ సమీపంలో రహదారికి ఇరువైపులా అటవీశాఖతో పాటు పంచాయతీ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. చనిపోయిన మొక్కల స్థానంలో కొత్తవి నాటారు. ఇటీవల ఆయా పంట పొలాల రైతులు గడ్డిని కాల్చి వేయడంతో మొక్కల చుట్టూ ఉన్న గడ్డితోపాటు మొక్కలు కాలిపోయాయి. లక్షలు వెచ్చించి హరితహారంలో మొక్కలు నాటుతున్నా వాటి సంరక్షణకు సరైన చర్యలు తీసుకోకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నెరవేరడంలేదు.

ఈ నెల 3 నుంచి హనుమాన్ దీక్షలు



నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మార్చి 3 నుంచి చారిత్రాత్మకమైన కొండాపూర్ హనుమాన్ ఆలయంలో హనుమాన్ దీక్షలు ప్రారంభం కానున్నాయి. కొండాపూర్ ఆశ్రమ పీఠాధిపతి అకిల భారత సాధుసంతుల తెలంగాణ రాష్ట్ర ప్రతినిధి సంగ్రాం మహారాజ్ ఆధ్వర్యంలో వందలాది మంది హనుమాన్ దీక్షలను స్వీకరిస్తారు. మండల దీక్షలు చేపట్టనున్న వారు మార్చి 3న ఉదయం 6 గంటల వరకు ఆశ్రమానికి చేరుకోవాలని సంగ్రాం మహారాజ్ తెలిపారు. పూర్తి వివరాల కోసం 9346907537 నంబరులో సంప్రదించాలన్నారు.


ఖేడ్‌లోని మార్కండేయ ఆలయం

ప్రతిష్ఠాపనోత్సవాలకు

ఆలయం ముస్తాబు

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): పట్టణ శివార్లలోని భక్త మార్కండేయ మహా దేవాలయం నిర్మాణం పనులు పూర్తి కావడంతో విగ్రహ ప్రతిష్ఠాపనకు ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయంలో శివ పంచాయతన సహిత మార్కండేయ విగ్రహాన్ని ప్రతిష్ఠించడానికి తమిళనాడులోని మహాబలిపురం నుంచి విగ్రహాలను తీసుకువచ్చారు. మార్చి 3 నుంచి 6 వరకు ఉత్సవాలను జరగనున్నాయి. రాంపూర్ ఆశ్రమ పీఠాధిపతి మాధవానంద సరస్వతీ స్వామి ఆశీస్సులతో ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాల్లో వివిధ మఠాధిపతులు అవదూత్‌గిరి మహారాజ్, సంగ్రాం మహారాజ్, సోమాయప్ప, బసవలింగ అవదూత్ మహారాజ్, గోపాల్ మహారాజ్, దేవగిరి మహారాజ్, కాశీనాథ్‌బాబా, అంబికా శివయోగి, కరణ్‌గజేంద్ర భారతి మహారాజ్, అంబాదాస్ మహారాజ్, విఠల్‌దాస్ మహారాజ్, దత్తు మహారాజ్, పండరి మహారాజ్‌లతో పాటు ప్రముఖులు పాల్గొంటారన్నారు.

క్రైం కార్నర్


రోడ్డు ప్రమాదంలో ఒకరు దుర్మరణం

● ఇద్దరికి తీవ్ర గాయాలు


లారీని ఢీ కొట్టిన కారు, శ్యామ్ బహదూర్(ఫైల్)

వర్గల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం చెందిన సంఘటన వర్గల్ మండలం గౌరారం రాజీవ్ రహదారిపై శుక్రవారం తెల్లవారుజామున చోటు చేసుకున్నది. గౌరారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి తెలిపిన వివరాల ఇలా ఉన్నాయి. మెడ్చల్ జిల్లా టీచర్స్ కాలనికి చెందిన జరిగినశ్యామ్ బహదూర్ సింగ్ (41) తన స్నేహితులు చందు యాదవ్, వాకిటి సాయికుమార్‌తో కలసి చందు యాదవ్ కారులో రాయిపోల్ నుంచి మెడ్చల్‌కు శుక్రవారం తెల్లవారుజామున 3 గంటల సమయంలో వెళ్తున్నాడు. గౌరారం వద్దకు రాగానే మామిడ్యాల కమాన్ వైపునకు హైదరాబాద్ వైపు నుంచి వస్తున్న లారీ ఆకస్మాత్తుగా మలుపు తిరగడంతో కారు అదుపు తప్పి లారీని ఢీ కొట్టింది. దీంతో కారులో వెనక సీట్లో కూర్చున్న శ్యామ్ బహదూర్ తలకి తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ముందు సీట్లో కూర్చున్న చందు యాదవ్, సాయికుమార్‌లకు తీవ్రగాయాలు కావడంతో చికిత్సకోసం గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్యామ్ బహదూర్ భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

సైకిల్ అదుపుతప్పి..


మృతి చెందిన భిక్షపతి

కొండపాక, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) :సైకిల్ అదుపుతప్పి వ్యక్తి మృతి చెందిన సంఘటన కొండపాక మండలం మర్పడగలో శుక్రవారం చోటుచేసుకుంది. త్రీ టౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మర్పడగ గ్రామానికి చెందిన గుడిగందుల భిక్షపతి (40)అనే వ్యక్తి పెయింటింగ్ పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గ్రామంలో గురువారం సైకిల్‌పై నిత్యావసర సరకులు తీసుకురావడానికి వెళ్తుండగా సైకిల్ అదుపుతప్పి కింద పడ్డాడు. దీంతో తీవ్ర గాయాలైన అతడిని వెంటనే చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ రాత్రి మృతి చెందాడు. మృతుడికి భార్య మౌనిక, ఇద్దరు కూతుర్లు ఉన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుదాఘాతంతో ..

ఝరాసంగం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) : విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఈదులపల్లి గ్రామంలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానిక ఎస్‌ఐ నరేష్ కథనం ప్రకారం గ్రామానికి చెందిన ఏసురత్నం (56) గ్రామంలో చర్చి నూతన భవన నిర్మాణానికి నీళ్లు పడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. మృతుడి భార్య శోభరాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

కంకర క్వారీలో ఇటాచీ ఆపరేటర్..

జిన్నారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): కంకర క్వారీలో పని చేస్తూ ప్రమాదవశాత్తు ఇటాచీ ఆపరేటర్ మృతిచెందాడు. వివరాలు ఇలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన శ్రీనివాస్(30) గత పదేళ్లుగా మండలంలోని కాజీపల్లిలో నివాసముంటూ ఇటాచీ ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. గ్రామ శివారులోని స్టోన్ క్రషర్ క్వారీ గుంతలో శుక్రవారం ఇటాచీతో పనులు చేస్తుండగా బండరాయి పైనుంచి వచ్చి ఇటాచీ పైన పడింది. ఈ ఘటనలో శ్రీనివాస్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని చికిత్సకోసం తరలించగా మృతిచెందాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొని యువకుడు..


సాయికార్తిక్ మృతదేహం

సదాశివ పేట, ఫిబ్రవ రి28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా సదాశివపేట పట్టణంలో చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని గురనగర్ కాలనీకి చెందిన సాయికార్తిక్(18) ద్విచక్ర వాహనంపై సంగారెడ్డి వైపు వెళ్తున్న క్రమంలో పట్టణం మెయిన్ రోడ్డుహంస ఫంక్షన్ హాల్ వద్ద రోడ్డు డివైడర్‌లో ఉన్న చెట్లకు నీళ్లు పడుతున్న మున్సిపల్ వాటర్ ట్యాంకర్‌కు వెనుక నుంచి అతివేగంగా ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సాయికార్తిక్ తలకు తీవ్ర గాయాలు కావడంతో వైద్యం కోసం సంగారెడ్డిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. మృతుడి తండ్రి అంబన్న ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.


జాతరలో భక్తుల సందడి

వనదుర్గకు వైభవంగా రథోత్సవం

వేలాదిగా తరలివచ్చిన భక్తులు

- జయజయ ధ్వానాల మధ్య రథాన్ని లాగిన భక్తులు
- మూడో రోజూ జాతర సందడి


కిటకిటలాడుతున్న దుర్గమ్మ మాడవీధులు




దుర్గామాతను దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే పద్మారెడ్డి

పాపన్నపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): జయజయ ధ్వానాల మధ్య ఏడుపాయల వనదుర్గమ్మ రథం కదిలింది. ఏడుపాయల జాతర మూడోరోజు శుక్రవారం సాయంత్రం అమ్మవారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తజనం జై బోలో దుర్గామాత.. అంటూ వేనోళ్ల స్తుతిస్తూ రథాన్ని లాగడానికి పోటీపడ్డారు. గుట్టలు ప్రతిధ్వనిస్తుండగా మేళ తాళాలు, డప్పు చప్పుళ్ల మధ్య ఏడుపాయల వీధుల గుండా రథోత్సవం కొనసాగింది. ఆనవాయితీ ప్రకారం ఆలయ ఈవో, తహసీల్దార్, నాగ్సాన్‌పల్లి గ్రామానికి చెందిన తొలి బొట్టుదారులైన లచ్చిరెడ్డిగారి కుటుంబం, వతన్‌దారులైన గంగారెడ్డిగారి సాయిరెడ్డి ఇంటికి చేరుకొని బొట్టు సమర్పించి, 18 పనిబాటలవారితో కలిసి రథోత్సవానికి రావాలని కోరారు. ఆయన పనిబాటల వారితో కలిసి రాజగోపురం వద్ద గల ముత్యాలమ్మ గుడి వద్ద ఏర్పాటు చేసిన చావడి వద్దకు చేరుకున్నారు. రథోత్సవం హక్కుదారులైన లచ్చిరెడ్డి మేళ తాళాల మధ్య దేవాదాయ శాఖ కార్యాలయానికి చేరుకున్నారు. అనంతరం రెవెన్యూ అధికారులను ఎదుర్కొని గర్భగుడి నుంచి దుర్గమ్మ ఉత్సవ విగ్రహాన్ని పల్లకిలో తీసుకువచ్చి అందంగా అలంకరించిన రథంలో ప్రతిష్ఠించారు. అనంతరం 18 రకాల పనివారు సంప్రదాయ క్రతువులను చేపట్టారు. రథం ముందు పట్టుపరిచి, దండకాలు వేస్తూ అన్నం వ్రతం పట్టుపోశారు. అనంతరం ఆలయ అధికారులు, ప్రముఖులు కొబ్బరికాయలు, గుమ్మడికాయలను కొట్టి రథోత్సవాన్ని ప్రారంభించారు. రాత్రి 9 గంటలకు ప్రారంభమైన రథోత్సవం రాజగోపురం వద్దకు 12 గంటలకు చేరుకుంది. వేలాదిగా తరలివచ్చిన భక్తులు రథాన్ని లాగి తరించారు. మెదక్ ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి, ఆర్డీవో రమాదేవి, డీఎస్పీ ప్రసన్నకుమార్, సీఐ రాజశేఖర్‌రెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్‌గౌడ్, ఛీఫ్ ఫెస్టివల్ ఆఫీసర్ కృష్ణ, ఈవో చంద్రశేఖర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

నీటి కటకట.. పారిశుధ్య లోపం

ఏడుపాయల జాతరలో భక్తులకు తాగునీరు లేక ఇబ్బందులు పడ్డారు. జాతరలో భాగంగా తాత్కాలికంగా ఏర్పాటు చేసిన నీటి కుళాయిలతో పాటు వసతిగృహాల్లో నీరు లేకపోవడంతో మినరల్ నీరు కొనుగోలు చేసి వంటలు చేసుకున్నారు. మహిళలకు ఏర్పాటు చేసిన మూత్రశాలలు, మరుగుదొడ్లు నీరు సరఫరా కాకపోవడంతో పడరాని పాట్లుపడ్డారు. జాతర మొదటి రోజు నీరు రాక మహిళలు ఈవో కార్యాలయంలో ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో మూడు రోజులూ ఇబ్బందులు తప్పలేదు. మరోవైపు పారిశుధ్య లోపంతో ఏడుపాయల క్షేత్రం అపరిశుభ్రంగా తయారైంది.

దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి, ఏడుపాయల మాజీ చైర్మన్ బాలాగౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ వెంకట్రాంరెడ్డి, మాజీ సర్పంచ్‌లు గురుమూర్తిగౌడ్, బాపూరావు, జగన్, లింగారెడ్డితో పాటు సాయిరెడ్డి తదితరులు శుక్రవారం సాయంత్రం దుర్గమ్మను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

తొమ్మిదేళ్లకే ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు


ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్ సర్టిఫికెట్‌తో విహన్‌రామ్

ధూళిమిట్ట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హనుమతండాకు చెందిన అంతర్జాతీయ పర్వతారోహకుడు జాటోత్ విహన్‌రామ్(9) చిన్న వయస్సులోనే ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు సంపాదించాడు. ఆఫ్రికాలోని మౌంట్ కిలిమంజారో (5685మీ), హిమాచల్‌ప్రదేశ్‌లోని మౌంట్ పాతాల్సు(4250మీ)లను అధిరోహించినందుకుగాను, ఆయన పేరును ఇండియా బుక్ ఆఫ్ రికార్డులో చోటు లభించిందని బాలుడి తండ్రి తిరుపతినాయక్ తెలిపారు. పిట్టకొంచెం కూత ఘనం అన్నట్లుగా చిన్న వయస్సులోనే పెద్ద విజయాలు సాధించిన విహన్‌రామ్‌ను పలువురు అభినందించారు.

జాతీయ సైన్స్ సంబరాలకు రెండు ప్రాజెక్టులు


మెమెంటోతో విద్యార్థులు, అధ్యాపకులు

సిద్దిపేట కల్చరల్, ఫిబ్రవరి, 28 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో జరిగిన జాతీయ సైన్స్ దినోత్సవ సంబరాల్లో సిద్దిపేట జిల్లా నుంచి ఎంపికైన రెండు ప్రాజెక్టులను ప్రదర్శించారు. సైన్స్ కాంపిటీషన్ ఉత్సవాల్లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సైన్స్ ఎగ్జిబిషన్, ఇన్నోవేషన్, పుస్తక ప్రదర్శన, క్విజ్, పోస్టర్ మేకింగ్, ఫన్ విత్ సైన్స్ వర్క్‌షాప్ వంటి పోటీలు నిర్వహించారు. ఇందులో సైంటిఫిక్ ఎగ్జిబిషన్ ఇన్నోవేషన్‌లో పాఠశాలలు, కళాశాల నుంచి రాష్ట్రవ్యాప్తంగా 40 ప్రదర్శనలు ఎంపిక చేశారు. ఇందులో రెండు ప్రదర్శనలు సిద్దిపేట జిల్లాకు చెందిన కావడం, అవి మొదటి రెండు స్థానాల్లో నిలవడం విశేషం. జెడ్పీహెచ్ఎస్ దామరకుంట పాఠశాల నుంచి భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు చిన్న బ్రహ్మయ్య గైడ్ టీచర్‌గా, పదో తరగతి విద్యార్థి అశ్వంత్ రూపొందించిన 'ప్లాస్టిక్ బాటిల్ నుంచి ఫెన్సింగ్ దారం' ప్రాజెక్టు, లచ్చపేట ఉప్పల్‌వాయి ఆదర్శ పాఠశాల నుంచి జ్యోతి గైడ్ టీచర్‌గా తొమ్మిదో తరగతి విద్యార్థి హర్షవర్ధన్ రూపొందించిన రాకెట్ లాంచింగ్ విధానం ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ పాఠశాలలకు శుక్రవారం రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మెమెంటోలు అందజేశారు. ఈ సందర్భంగా గైడ్ టీచర్లను, విద్యార్థులను జిల్లా విద్యాశాఖ అధికారి ఎల్లంకి శ్రీనివాస్ రెడి, జిల్లా సైన్స్ అధికారి కర్నపల్లి శ్రీనివాస్ అభినందించారు.

సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు రాయపోల్ విద్యార్థి


అరవింద్

రాయపోల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సౌత్ జోన్ జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థి పి. అరవింద్ ఎంపికయ్యాడు. ఈ నెల 22న నల్గొండలో జరిగిన సెలక్షన్స్‌లో అరవింద్ ఉత్తమ ప్రతిభ కనబరిచి సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. మార్చి 1 నుంచి 3 వరకు నల్గొండ జిల్లా ఎన్జీ స్టేడియంలో నిర్వహించే సౌత్ జోన్ షూటింగ్ బాల్ పోటీలలో తెలంగాణ రాష్ట్రం తరపున పాల్గొంటారని పాఠశాల పీడీ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థిని హెచ్‌ఎం నాగరాజు అభినందించారు.

పొటాష్.. గుళికలు కొంటేనే యూరియా..

దౌల్తాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): యూరియా కొనుగోలు చేసేందుకు ఫర్టిలైజర్ షాప్‌నకు వెళ్తే పొటాష్, గుళికలు కొంటేనే యూరియా అమ్ముతామని కొర్రీలు పెడుతున్నారు. రైతులకు అవసరం లేకున్నా వాటిని కొంటేనే యూరియా అమ్ముతామని చెబుతుండటంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దొమ్మాట గ్రామానికి చెందిన గురువుగారి అంజయ్య గురువారం మండల కేంద్రంలోని ఓ ఫర్టిలైజర్ షాపునకు వెళ్లి నాలుగు బస్తాల యూరియా కావాలని అడిగారు. అయితే, పొటాష్. గుళికలు తీసుకుంటేనే యూరియా అమ్ముతామని షాపు యజమాని కొర్రీ పెట్టాడు. దీంతో సదరు రైతు విషయాన్ని మీడియాకు వివరించారు. యూరియాను అధిక ధరలకు విక్రయించడమే కాకుండా, పొటాస్.. గుళికలు అవసరం లేకపోయినా కొనాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రాణదాతలకు ప్రోత్సాహకం

క్షతగాత్రులకు సహకరిస్తే ఇబ్బందులు ఉండవు

'గుడ్ సమరిటన్'పై కొరవడిన అవగాహన.. ప్రారంభమై నాలుగేళ్లయినా ప్రయోజనం శూన్యం



సంగారెడ్డి క్రైం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన అనేక మంది సకాలంలో వైద్యం అందక మృత్యువాత పడుతున్నారు. ప్రమాదంలో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే పోలీసు కేసుల్లో తమ పేర్లు చేర్చబడతాయనే భయంతోనో లేదా అనవసరంగా కోర్టు చుట్టూ తిరగాల్సి వస్తుందనే ఆందోళనతోనో, మార్గమధ్యంలో చనిపోతే కేసు తమకు చుట్టుకుంటుందేమోనని అనుమానంతోనూ చాలా మంది తమ కళ్ల ముందు ప్రమాదం జరిగినా పట్టించుకోవడం లేదు. ఇలాంటి భయాలను వీడి క్షతగాత్రులకు సాయం చేస్తే ప్రాణాలను నిలపవచ్చు. ఇలా సహాయం చేసిన వారికి గుడ్ సమరిటన్ చట్టం రక్షణగా ఉంటుంది. అంతేకాకుండా ప్రోత్సాహకాన్ని పొందవచ్చు.

సహాయకులకు అండగా గుడ్ సమరిటన్

ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం అందిస్తే గుడ్ సమరిటన్ చట్టం ద్వారా ప్రోత్సాహకం అందుతుందన్న విషయం చాలామందికి తెలియదు. దీనిని కేంద్ర ప్రభుత్వం (రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ) 2021 అక్టోబరు 3వ తేదీన ప్రారంభించింది. 2026 మార్చి 31వ తేదీ వరకు అమలులో వుంటుంది. గుడ్ సమరిటన్ సరైన ప్రచారం లేక ప్రజల్లో అవగాహన లేకుండాపోయింది. రోడ్డు ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే ఈ పథకం కింద రూ.5వేల నగదుతో పాటు ప్రశంసాపత్రం అందజేస్తారు. ఎక్కువ మందిని రక్షించినట్లయితే పది మందిని ఎంపిక చేసి కేంద్ర ప్రభుత్వం రూ.లక్ష అదనపు ప్రోత్సాహకం ఇస్తుంది. ఒక వ్యక్తి సంవత్సరంలో గరిష్టంగా ఐదుసార్లు ఈ అవార్డు పొందేందుకు అర్హుడు. ప్రతి సంవత్సరం పది మంది ఉత్తమ ప్రాణదాతను గుర్తించి కేంద్ర ప్రభుత్వం లక్ష రూపాయలు ప్రోత్సాహకంగా అందిజేస్తుంది.

గోల్డెన్ అవర్ కీలకం

జిల్లాలో రోడ్డు ప్రమాదాలు ఏటా పెరిగిపోతున్నాయి. ఈ ప్రమాదాల్లో ఎంతో మంది తమ ప్రాణాలు కోల్పోతున్నారు. సరైన సమయంలో స్పందిస్తే ప్రమాదంలో గాయపడిన వారిని రక్షించే అవకాశం ఉంటుంది. రోడ్డు ప్రమాదంలో గాయపడిన వారికి గోల్డెన్ అవర్ అనేది కీలకం. ప్రమాదం జరిగిన గంటలోపే గాయపడిన వారిని ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలిస్తే 90 శాతం ప్రాణాలు రక్షించే అవకాశం వుంటుంది. గాయపడిన వారిని దగ్గరలోని ఏ ఆసుపత్రికైనా తీసుకెళ్లి కనీసం ప్రథమ చికిత్స చేసినా అతడు బతికే ఛాన్సుంటుంది. దీన్నే గోల్డెన్ అవర్ అంటారు.

మూడేళ్లుగా సంగారెడ్డి జిల్లాలో చోటు చేసుకున్న రోడ్డు ప్రమాద వివరాలు

సంవత్సరం	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2022	798	466	754
2023	827	432	781
2024	852	384	913

అవగాహనేది?

క్షతగాత్రులను సకాలంలో ఆసుపత్రులకు తరలించే విషయంలో ప్రజలకు సరైన అవగాహన కల్పించేందుకు రోడ్డు రవాణా, రహదారుల శాఖగానీ, పోలీసు శాఖగానీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. గుడ్ సమరిటన్ చట్టం అమలులో ఉందన్న విషయం ఎవరికీ తెలియదు. సహాయకులకు ఎలాంటి భయం అవసరం లేదని తెలియజేయడంలో విఫలమయ్యాయి. ఈ చట్టం అమలులోకి వచ్చిన నాలుగేళ్లలో జిల్లాలో ఒక్కరు కూడా ప్రోత్సాహకం అందుకున్నవారు లేరంటే ఏ మేరకు ప్రచారం ఉందో దీన్ని బట్టే తెలుస్తోంది. మినిస్ట్రీ ఆఫ్ రోడ్డు ట్రాన్స్‌పోర్టు, హైవేస్ వెబ్‌సైట్ ద్వారా గుడ్ సమరిటన్‌కు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. క్షతగాత్రులను గంట లోపు ఆసుపత్రికి తరలించిన తర్వాత స్థానిక పోలీసులకు సమాచారం ఇస్తే వారు ప్రాణదాత అంటూ ఒక లెటర్ ఇవ్వడంతో పాటు ప్రమాదానికి సంబంధించిన సమాచారంతో రశీదు ఇస్తారు. ఆసుపత్రి వర్గాలు కూడా ఈ వివరాలను ధ్రువీకరిస్తూ సంబంధిత పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇస్తాయి.

పథకంపై విస్తృత ప్రచారం



గుడ్ సమరిటన్ చట్టంపై జిల్లాలో విస్తృత ప్రచారం చేయనున్నాం. దీని గురించి సరైన అవగాహన లేకపోవడంతో ప్రమాదాల్లో గాయపడిన వారిని ఆసుపత్రిలో సకాలంలో చేర్పించలేకపోతున్నారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తే పోలీస్‌స్టేషన్ చుట్టూ తిరగాల్సి వస్తుందనే భయాన్ని విడనాడాలి. గాయపడిన వారిని ఆసుపత్రికి తరలిస్తే పోలీసుల నుంచి ఎలాంటి ఇబ్బందులు ఉండబోవు. యువజన సంఘాలకు, జిల్లాలోని అన్ని కళాశాలల్లో విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తాం.

\- చెన్నూరి రూపేష్, సంగారెడ్డి జిల్లా ఎస్పీ

భూమి రిజిస్ట్రేషన్ లాగే విత్తన రిజిస్ట్రేషన్

- ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, పీపీవీఎఫ్ఆర్ఏ చైర్మన్ త్రిలోచన మహాపాత్ర



జహీరాబాద్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): రైతులు ఆర్థిక ప్రగతి సాధించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఐసీఏఆర్ మాజీ డైరెక్టర్ జనరల్, పీపీవీఎఫ్ఆర్ఏ (ప్రొటక్షన్ ఆఫ్ ప్లాంట్ వెరైటీస్ అండ్ ఫార్మర్స్ రైట్స్) చైర్మన్ డా. త్రిలోచన మహాపాత్ర పేర్కొన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలోని దిడిగి గ్రామ శివారులో ఉన్న డీడీఎస్-కేవీకేలో తెలంగాణలోని 16 కేవీకేల పరిధిలోని 103 మంది రైతులు, శాస్త్రవేత్తలకు పంటల రకాలు, రైతుల హక్కుల పరిరక్షణ పై అవగాహన సదస్సును శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ భూమిని ఏవిధంగా రిజిస్ట్రేషన్ చేసుకుంటామో అలాగే విత్తనాలు, పంటలు, చెట్లను రిజిస్ట్రేషన్లను చేసుకోవాలన్నారు. పంటలను పండించిన, విత్తనాలను సంరక్షించుకుంటున్న రైతులకు హక్కులు ఉండాలని ఆయన పేర్కొన్నారు. కేవీకేలో రైతులు వారి ప్రాంతాల్లో పండిస్తున్న పంటలు, విత్తన బ్యాంకుల హక్కులపై రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించామని చెప్పారు. తెలంగాణలోని 16 కేవీకేల పరిధిలోని 103 మంది రైతులు రిజిస్ట్రేషన్ చేయించుకునేందుకు వచ్చారని తెలిపారు. జహీరాబాద్ ప్రాంతంలో డీడీఎస్ 40 సంవత్సరాలుగా పాత పంటల సాగు, విత్తన సంరక్షణ, మహిళా రైతులచే విత్తన బ్యాంకుల ఏర్పాటుకు చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ కృష్ణ ఎల్లా

సరళమైన భాషలో యోచిస్తే ఉత్తమ పరిష్కారాలు

భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ కృష్ణ ఎం.ఎల్లా

గీతంలో జాతీయ సైన్స్ దినోత్సవం

పటాన్‌చెరు రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సరళమైన భాషలో సైన్స్ గురించి ఆలోచిస్తే ఉత్తమమైన పరిష్కారాలు లభిస్తాయని పద్మభూషణ్ అవార్డు గ్రహీత, భారత్ బయోటెక్ ఎండీ డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా అన్నారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని గీతం ఛేంజ్ మేకర్స్ సిరీస్‌లో భాగంగా శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన వ్యవసాయ కుటుంబంలో పుట్టిన తాను ఎదిగిన క్రమాన్ని వివరించారు. భారత్ బయోటెక్‌ను స్థాపించడం, కరోనా వాక్సిన్ కోవాక్సిన్, టైఫాయిడ్ టీసీవీ, రోటావాక్ వంటి సంచలన వాక్సిన్‌లో అభివృద్ధి వరకు తన ప్రయాణాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం 12 నుంచి 15 శాతం జాతీయ స్థూల ఉత్పత్తి వృద్ధిని కోరుకుంటే.. అది ఆవిష్కరణలతో మాత్రమే సాధ్యమవుతుందన్నారు. దేశ ప్రస్తుత ఆవిష్కరణ స్థితిపై ఆందోళన వ్యక్తం చేసిన ఆయన అందుబాటులో ఉన్న శాస్త్రీయ జ్ఞాన సంపదను గుర్తించాలని, సైన్స్ ప్రాథమిక సూత్రాలను స్వీకరించాలని సూచించారు. కార్యక్రమంలో గీతం అధ్యక్షుడు ఎం. భరత్ మతుకుమిల్లి, గీతం చాన్స్‌లర్ డాక్టర్ వీరందర్ సింగ్ చౌహాన్, ఐసీటీ పూర్వ డైరెక్టర్, గీతం విశిష్ట ఆచార్యుడు డాక్టర్ శ్రీవారి చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. అంతకు ముందు గీతంలో నెలకొల్పిన మల్టీ డిసిప్లినరీ యూనిట్ ఆఫ్ రీసెర్చ్ ఆన్ ట్రాన్స్‌లేషనల్ ఇనిషియేటివ్స్‌ను డాక్టర్ ఎల్లా ప్రారంభించారు. కార్యక్రమంలో జంట నగరాల్లోని సుమారు పది కళాశాలల నుంచి 550 మంది విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు. విద్యార్థుల ప్రశ్నలకు డాక్టర్ కృష్ణ ఎం. ఎల్లా సమాధానాలు ఇచ్చారు.

ముడి వీడేనా?

- ట్రిపుల్ ఆర్ కోసం మూడు సర్వేలు
- భూములు నోటిపై చేసిన అధికారులు
- మూడో సర్వేకు సర్కారు ఓకే..
- రెండు చోట్ల డీ నోటిపై చేయక ఇక్కట్లు
- నిర్మాణ అనుమతులు రాక పాట్లు



నర్సాపూర్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): ట్రిపుల్ ఆర్ నర్సాపూర్ పట్టణ ప్రజలకు పీడగా మారింది. ఈ రోడ్డు కోసం చేసిన సర్వే స్థానికులను ఇబ్బందులకు గురి చేస్తోంది. సర్వే చేసిన ప్రాంతాలను నోటిఫై చేసి, ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేసిన అధికారులు.. ఆయా ప్రాంతాల గుండా రోడ్డు వెళ్లడం లేదని తేల్చినా.. వాటిని డీ నోటిఫై చేయకపోవడంతో నిర్మాణాలను అనుమతులు రాక జనం ఇబ్బందులు పడుతున్నారు.

జిల్లాలో ట్రిపుల్ ఆర్ కోసం మూడు రకాల సర్వేలు చేసి, ప్రభుత్వానికి నివేదికలు పంపారు. అందులో ఒకటి నర్సాపూర్ పట్టణ సమీపంలో నుంచి ఉండటంతో అధికారులు ఆ ప్రాంతాన్ని నోటిఫై చేసి, ప్రతిపాదించిన స్థలాల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అంతటితో అధికారులు ఆయా ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులు నిలిపివేశారు. అనుమతులు లేకపోవడంతో బ్యాంకుల రుణాలూ పొందలేని పరిస్థితి.

రెండు చోట్ల ఇబ్బందులు

ట్రిపుల్ ఆర్ కోసం ప్రభుత్వం మూడు సర్వేలు చేసింది. నర్సాపూర్ పట్టణ సమీపం నుంచి సంగారెడ్డి మార్గంలోని రుస్తుంపేట కమాన్ సమీపం నుంచి, మెదక్ మార్గంలోని సీతారాంపూర్, గోకుల్ కాలనీ మీదుగా, వెల్దుర్తి మార్గంలో ఖండసరి షుగర్ ఫ్యాక్టరీ వరకు ట్రిపుల్ ఆర్ వెళ్లేలా సర్వే చేశారు. ఆ సమయంలోనే అధికారులు హద్దులు నిర్ణయించారు. రెండో సర్వే నర్సాపూర్, శివ్వంపేట, కౌడిపల్లి మండలాల్లోని బ్రాహ్మణపల్లి, నాగ్సన్‌పల్లి, శివ్వంపేట మండలం పిల్లుట్ల తదతర ప్రాంతాల మీదుగా సర్వే చేశారు. ఆయా ప్రాంతాల్లో ఎలాంటి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఆదేశాలు జారీ చేశారు. అయితే, ఈ రెండింటినీ పక్కన పెట్టిన హెచ్‌ఎండీఏ.. ట్రిపుల్ ఆర్ కోసం మూడో సర్వేను ఓకే చేసింది. అయితే, మొదట సర్వే చేసిన ప్రాంతాలను డీ నోటిఫై చేయాల్సి ఉంటుంది. కానీ, రోజులు గడుస్తున్నా.. డీ నోటిఫై చేయకపోవడంతో ఆయా ప్రాంతాల్లో కొత్తగా ఇళ్లు కట్టుకోవాలన్నా.. తమ అవసరాలకు స్థలాలు అమ్ముకోవడం, బ్యాంకు రుణాలు తీసుకోవడం వంటివి చేయలేకపోతున్నారు.

అనుమతులు లేవంటూ..

ఒక్క నర్సాపూర్ పట్టణ పరిధిలోనే సుమారు 200 మంది బాధితులు ఉన్నారు. ఇందులో కొందరు గృహనిర్మాణాల కోసం దరఖాస్తు చేసుకుంటూ సదరు భూమి హెచ్‌ఎండీఏ అధీనంలో ఉందని వస్తోంది. నిర్మాణాలు ప్రారంభించిన వారికి అనుమతులు లేవంటూ నోటీసులు వస్తున్నాయి. ట్రిపుల్ ఆర్ కోసం మూడో సర్వే ఖరారై.. భూసేకరణ కూడా జరుగుతున్న నేపథ్యంలో కలెక్టర్ కల్పించుకుని తమ భూములను డీ నోటిఫై చేయాలని బాధితులు కోరుతున్నారు.

కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లాం..

ట్రిపుల్ ఆర్ కోసం ప్రతిపాదిత ప్రాంతంలో అనుమతులు రాక ఇబ్బందులు పడుతున్న విషయం కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లాం. ఆన్‌లైన్‌లో హెచ్‌ఎండీఏ డీ నోటిఫై చేస్తే సమస్య పరిష్కారం అవుతుందని చెప్పారు. ఇప్పటికే కలెక్టర్ దృష్టికి సమస్య తీసుకెళ్లినందున త్వరలోనే పరిష్కారం అయ్యే అవకాశాలు ఉన్నాయి.

\- రామకృష్ణరావు, మున్సిపల్ కమిషనర్

యూరియా కృత్రిమ కొరత సృష్టిస్తే చర్యలు

● ఏవో ఝూన్సీలక్ష్మీబాయి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి మండలంలో యూరియాకు ఎలాంటి కొరత లేదని వ్యవసాయ శాఖ మండలం అధికారిణి (ఏవో) ఝూన్సీ లక్ష్మీబాయి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంగారెడ్డి మండలంలోని పీఏసీఎస్ ఇస్మాయిల్‌ఖాన్‌పేట డీసీఎంఎస్, అన్ని సంఘాల డీలర్ అవుట్‌లెట్‌లలో యూరియా అందుబాటులో ఉందన్నారు. తెలంగాణ రాష్ట్ర మార్కెఫెడ్ అదనంగా సంగారెడ్డిలో సుమారు 3వేల మెట్రిక్ టన్నుల యూరియా బఫర్ స్టాక్‌గా ఉందని, డీలర్లు యూరియా కృత్రిమ కొరత సృష్టించి రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నేతలు

టేక్మాల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన టేక్మాల్‌లో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను శుక్రవారం కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నిమ్మ రమేష్ ప్రారంభించారు. మోడల్ పాఠశాల నుంచి గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాల వరకు రూ.15 లక్షల వ్యయంతో ఈ రోడ్డును నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మోడల్ పాఠశాల ప్రిన్సిపాల్ సాయిలు, సొసైటీ, డైరెక్టర్, పాపయ్య, మజార్, కిశోర్, సాగర్ పాల్గొన్నారు.

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'



పెద్దశంకరంపేటలో ప్రజలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ శంకర్

పెద్దశంకరంపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని పెద్దశంకరంపేట ఎస్‌ఐ శంకర్ అన్నారు. శుక్రవారం పెద్దశంకరంపేటలోని అంబేద్కర్ కాలనీలో పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా అవగాహన కల్పించారు. ప్రజలు చట్టాలను గౌరవించాలన్నారు. కార్యక్రమంలో పేట ఆర్‌ఐ రమేష్, పోలీసులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

హక్కులకు భంగం కలిగించొద్దు

నిజాంపేట, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం కల్పించిన పౌర హక్కులకు ఎలాంటి భంగం కలిగించినా చట్టపరమైన చర్యలు ఉంటాయని అధికారులు పేర్కొన్నారు. మండల పరిధిలోని నగరం గ్రామంలో శుక్రవారం అంటరానితనం, జోగిని వ్యవస్థ, మూఢనమ్మకాలపై గ్రామస్థులులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆరిఫ్ హుస్సేన్, పోలీసులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రామచంద్రాపురం టౌన్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం అశోక్‌నగర్ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలో నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఏఈ తిరుపతమ్మ చెప్పారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు సరఫరా నిలిపివేస్తున్నామని పేర్కొన్నారు. రామచంద్రాపురం, శ్రీనివాస్‌నగర్‌కాలనీ. దర్గా, గార్డెన్‌ఏరియా, సండేమార్కెట్, సంగీతథియేటర్ పరిసరాల్లో, బొంబేకాలనీ, ఈఎస్‌ఐ ఆసుపత్రి, రామచంద్రారెడ్డినగర్, నాగులమ్మ ఆలయం, స్నేహలేక్‌వ్యూ అపార్ట్‌మెంట్లు, జీహెచ్‌ఎంసీ కార్యాలయం, బీడీఎల్ కాలనీ, హెచ్‌ఐజీ, ఎల్‌ఐజీ, భారతీనగర్ కాలనీలు, ఎంఆర్‌ఎఫ్, మ్యాక్ సొసైటీకాలనీలు, రామచంద్రాపురం పరిశ్రమల ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కార్యదర్శులు, ఎఫ్‌ఏలకు మెమోలు జారీ

చిలప్‌చెడ్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): సక్రమంగా విధులు నిర్వహించని కార్యదర్శులు, ఎఫ్‌ఏలకు మెమోలు జారీ చేసినట్లు ఎంపీడీవో ఆనంద్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ఉపాధి హామీ పథకంలో భాగంగా చేయించాల్సిన పనుల్లో 50 మంది లేబర్‌లను పనిలో పెట్టనందువలన ఆయా గ్రామాలకు చెందిన కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మెమోలు జారీ చేశామన్నారు.

మనోహరాబాద్ ఎంపీడీవోగా కృష్ణమూర్తి



మనోహరాబాద్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): మనోహరాబాద్ ఎంపీడీవో కృష్ణమూర్తి బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న వేంకటేశ్వర్‌రెడ్డి శుక్రవారం పదవి విరమణ పొందడంతో మనోహరాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న కృష్ణమూర్తి ఎంపీడీవోగా బాధ్యతలు తీసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీవో లక్ష్మీనర్సింహులు, సిబ్బంది పాల్గొన్నారు.



చెత్తాచెదారంతో నిండిపోయిన పోతంశెట్టిపల్లిలోని ప్రకృతి వనం

చెత్త వనం..

ఓపెన్ బార్‌లా..

● మందుబాబులకు అడ్డాగా మారిన వైనం
● పేరుకుపోయిన ఖాళీ మద్యం బాటిళ్లు, చెత్త

కొల్చారం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్రజలు ఆహ్లాదకర వాతావరణం అందుబాటులోకి తేవాలన్న లక్ష్యంతో ప్రభుత్వం పల్లె ప్రకృతివనాలను ఏర్పాటు చేసింది. ఇందులో సేదా తీరేందుకు వీలుగా బెంచీల సౌకర్యం కూడా కల్పించింది. కానీ వాటి నిర్వహణ సరిగా లేక నిరుపయోగంగా మారుతున్నాయి. కొన్ని ప్రకృతివనాల్లో చెత్త పేరుకుపోయి అందవిహీనంగా మారగా, మరికొన్ని మందుబాబులకు సిట్టింగ్ స్పాట్‌గా మారాయి. అందుకు నిలువెత్తత నిదర్శనం కొల్చారం మండలం పోతంశెట్టిపల్లి ప్రకృతి వనమే. ఇందులో ఉన్న బెంచీలపై ఉదయం నుంచి సాయంత్రం వరకు మద్యం ప్రియులు తిష్టవేసి కల్లు తాగుతున్నారు. జిల్లా యంత్రాంగం ప్లాస్టిక్ కవర్లను వాడవద్దని నివారించినా.. అవేం పట్టించుకోకుండా మద్యం తాగేటప్పుడు మంచింగ్ కోసం కవర్లలో తిను పదార్థాలు తీసుకొచ్చుకుని తిని అనంతరం ఇక్కడే వదిలేస్తున్నారు. దీంతో చెత్తాచెదారం, ప్లాస్టిక్ కవర్లు, మద్యం బాటిళ్లతో ప్రకృతి వనం నిండిపోయింది. ముఖ్యంగా ప్రతీ బుధవారం జరిగే సంత రోజున మందుబాబులు మరింత రెచ్చిపోతున్నారు. యథేచ్ఛగా బెల్ట్‌షాపులను నుంచి మందు కొనుగోలు చేసి ఇక్కడకు తెచ్చుకుని తాగుతున్నారు. దీంతో స్థానిక ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. ఈ విషయమై పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని స్థానికులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా స్పందించి ప్రకృతి వనంలో మందుబాబుల ఆగడాలను అరికట్టడంతోపాటు శుభ్రం చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని కోరుతున్నారు.



పల్లె ప్రకృతి వనంలో మందుబాబుల సిట్టింగ్

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

● డీఐఈవో గోవిందరామ్

సంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా ఇంటర్మీడియట్ అధికారి(డీఐఈవో) గోవిందరామ్ సూచించారు. సంగారెడ్డి శాంతినగర్‌లోని ఓ డిగ్రీ కళాశాలలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్, కస్టోడియన్స్ అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఐఈవో గోవిందరామ్ మాట్లాడుతూ మార్చి 5 నుంచి జరిగే ఇంటర్ పరీక్షల నిర్వహణలో చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్‌మెంటల్ ఆఫీసర్ల పాత్ర కీలకమన్నారు. వారు విధుల పట్ల అంకితభావంతో పనిచేయాలని సూచించారు. పరీక్ష రాసేందుకు వచ్చే విద్యార్థులకు కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. పరీక్షలు సజావుగా జరిగేలా అన్ని రకాల ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరా నిఘాలో పరీక్షలు జరుగుతాయని, ఏమైనా సమస్యలు ఉత్పన్నమైతే తమ దృష్టికి తేవాలన్నారు. సమావేశంలో డీఈసీ మెంబర్లు, హెచ్‌పీసీ మెంబర్లు, సీఎస్, డీవోలు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఐఈవో గోవిందరామ్

'ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిద్దాం'



ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగిస్తున్న జ్ఞానేశ్వర్

సంగారెడ్డి రూరల్ / నారాయణఖేడ్ ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : ప్లాస్టిక్ వ్యర్థాలను తొలగించి జీవనదిని కాపాడుదామని నాగల్‌గిద్ద మండలం ముక్తాపూర్‌కు చెందిన ఎర్త్‌లీడర్, పర్యావరణ ప్రేమికుడు, సామాజిక కార్యకర్త పొలడుగు జ్ఞానేశ్వర్ పిలుపునిచ్చారు. సంగారెడ్డి మండలం ఫసల్‌వాదిలో గ్రామంలోని మంజీరా నదిలో పేరుకుపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను శుక్రవారం ఆయన తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగరికత పురుడుపోసుకున్నది నది పరివాహక ప్రాంతాల్లోనేనని నదులు పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత అందరిదన్నారు.

ఘనంగా సైన్స్ దినోత్సవం

మెదక్, సంగారెడ్డి జిల్లాలోని పలు విద్యా సంస్థల్లో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీవీ రామన్ చిత్రపటాలు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలు పాఠశాలల్లో సైన్స్ ఫెయిర్ నిర్వహించారు. విద్యార్థులు పోటీపడి నిర్వహించిన నమూనాలను ప్రదర్శించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు వాటిని సందర్శించి విద్యార్థులను అభినందించారు. జ్ఞాన విజ్ఞాన వేదిక సభ్యులు విద్యార్థులకు మూఢనమ్మకాలపై అవగాహన కల్పించారు.

-న్యూస్ నెట్‌వర్క్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి)



పెద్దశంకరంపేటలో సైన్స్ నమూనాల ప్రదర్శన



సంగారెడ్డిలోని జిల్లా సైన్స్ సెంటర్‌లో సీవీ రామన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు



జహీరాబాద్ : మాణిక్‌ప్రభు పాఠశాలలో..



జహీరాబాద్ : అల్లీపూర్‌లోని శ్రీక్రిష్ణవేణి పాఠశాలలో ..

కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి

సంగారెడ్డి రూరల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : కార్పొరేట్ కళాశాలల్లో ముందస్తు అడ్మిషన్లు తీసుకుంటున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్‌ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి దత్తురెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు సంగారెడ్డిలో జిల్లా ఇంటర్మీడియట్ అధికారి గోవింద్‌రామ్‌కు శుక్రవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కార్పొరేట్ కళాశాలల దోపిడి రోజురోజుకు పెరిగిపోతున్నదన్నారు. పరీక్షల సమయంలో ఫీజులు కడితేనే హాల్‌టికెట్లు ఇస్తామని విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. వినతి పత్రం అందజేసిన వారిలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అశోక్, రాకేష్, నితిన్ తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలంటూ ధర్నా

నారాయణఖేడ్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో శుక్రవారం ఖేడ్ తహసీల్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా పార్టీ ఉమ్మడి మెదక్ జిల్లా నాయకుడు తెంకటి కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఆరు గ్యారెంటీను అమలు చేస్తూ అందుకు అవసరమైన నిధులను బడ్జెట్‌లో కేటాయించాలన్నారు. నాయకులు బాలరాజు, అరుణ్, అరరుణ్, బేతయ్య తదితరులుఉ పాల్గొన్నారు.

వైభవంగా పార్వతీ పరమేశ్వరుల కల్యాణం



ఝరాసంగం : కల్యాణం జరిపిస్తున్న వేదపండితులు

ఝరాసంగం, ఫిబ్రవరి28(ఆంధ్రజ్యోతి) దక్షిణ కాశీగా ప్రసిద్ధిగాంచిన కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో మహాశివరాత్రి బ్రహోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీ పరమేశ్వరుల కల్యాణం అంగరంగవైభవంగా నిర్వహించారు. కర్ణాటక, మహారాష్ట్రలతో పాటు జిల్లా నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ఆలయ ఆవరణలో స్వామి వారి ఉత్సవ విగ్రహాలను పల్లకీలో ప్రతిష్ఠించి వేదపండితులచే వేదామంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య స్వామి వారి కల్యాణం నిర్వహించారు. అదేవిధంగా మండల పరిధిలోని మాచునూర్ గ్రామ శివారులోని రామేశ్వర ఆలయంలో అమావాస్య సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శివరుద్రప్ప, గ్రామస్థులు, భక్తులు పాల్గొన్నారు.

● కల్హేర్, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి) : కల్హేర్, సిర్గాపూర్ మండలాల్లోని వివిధ గ్రామాల్లో మహాశివరాత్రి సందర్భంగా ఆయా దేవాలయాల ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం మండల కేంద్రమైన కల్హేర్‌లో జాతర, ఫత్తేపూర్‌లో దుర్గాభవానీ మాతా ఆలయంలో బోనాల ఊరేగింపు నిర్వహించారు. సిర్గాపూర్ మండల పరిధిలోని జంలా తండా ఓంకారేశ్వర ఆలయ ఉత్సవాల్లో భాగంగా కుస్తీ పోటీలు నిర్వహించారు. విజేతలకు మాజీ సర్పంచ్ దివ్యభారతి చరణ్‌కుమార్ నగదు, రజత కడియాలు బహుమతులుగా అందజేశారు.



కల్హేర్ మండలం ఫత్తేపూర్‌లో దుర్గాభవానీ మాతకు బోనాలను ఊరేగింపు తీసుకెళ్తున్న భక్తులు

ఉపాధి పనుల పరిశీలన

కంగ్టి, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగూర్.కెలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను శుక్రవారం ఎంపీడీవో సత్తయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కూలీలకు పలు సలహాలు, సూచనలు అందించారు. రాజుపాటిల్ తన పొలంలో చేపడుతున్న వర్మీ కంపోస్టును, నిర్మిస్తున్న పశువుల షెడ్డును పరిశీలించారు. ఆయన వెంట ఫీల్డ్ అసిస్టెంట్ సంజీవ్, తదితరులు ఉన్నారు.



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీవో

రైల్వే క్రాసింగ్ వద్ద బీటీ రోడ్డు



రైల్వే క్రాసింగ్ వద్ద నిర్మించిన బీటీ రోడ్డు

రామచంద్రాపురం, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం మండల పరిధిలోని ఈదులనాగుల పల్లి రైల్వే క్రాసింగ్ వద్ద ఉన్న గుంతలను పూడ్చుతూ బీటీ రోడ్డును ఏర్పాటు చేశారు. ఈ నెల 17న 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అంతర్గత రహదారులు ఛిద్రం' కథనానికి రైల్వే అధికారులు స్పందించారు. రైల్వే ట్రాక్ వద్ద ఉన్న స్పీడ్ బ్రేకర్ ప్రయాణికులకు ఇబ్బంది కలుగజేయకుండా దాన్ని ర్యాంప్ రూపంలో ఏర్పాటు చేశారు. మొత్తం గుంతలను పూడ్చి బీటీ రోడ్డును వేశారు. కానీ ఆర్‌అండ్‌బీ రోడ్డులోని మట్టి ముద్దలను తొలగించకుండా అలాగే విడిచిపెట్టారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు తప్పడం లేదు.

ఏకాగ్రతతో చదివితే విజయం తథ్యం

● అదనపు కలెక్టర్ నాగేష్



విద్యార్థులకు సూచనలు ఇస్తున్న అదనపు కలెక్టర్

చిన్నశంకరంపేట, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులు ఏకాగ్రతతో చదివితే విజయం తప్పకుండా లభిస్తుందని మెదక్ అదనపు కలెక్టర్ నాగేష్ అన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన చేయాలన్నారు. ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ పదోతరగతి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని కేజీబీవీ ఎస్వో గీతను ఆదేశించారు. సైన్స్ దినోత్సవం సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నమూనాలను తిలకించి అభినందించారు. ఆయన వెంట తహసీల్దార్ మన్నన్, ఆర్‌ఐ చందు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయాన్ని సందర్శించిన జడ్పీ సీఈవో



తాడ్దానిపల్లిలో నిల్వ నీటిని పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో జానకిరెడ్డి

పుల్‌కల్, ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): చౌటకూర్ ఎంపీడీవో కార్యాలయనిన్న జిల్లా పరిషతు సీఈవో జానకిరెడ్డి శుక్రవారం సందర్శించారు. కొత్త ఎంపీడీవో కార్యాలయాన్ని చౌటకూర్ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సౌకర్యాలపై ఆరా తీశారు. సరిపడా ఫర్నీచర్, కంప్యూటర్లు సమకూర్చాలని ఎంపీడీవో శంకర్ ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. మరికొంత సామగ్రి ఎంపీడీవో కార్యాలయం నుంచి తీసుకురావాల్సి ఉందన్నారు. కొత్త కార్యాలయానికి జూనియర్ సహాయకుడు, కంప్యూటర్ ఆపరేటర్, ఇద్దరు ఆఫీస్ సబార్డినేటర్లను కేటాయించడంతో కార్యకలాపాలు కొనసాగుతున్నాయన్నారు. అంతకుముందు సీఈవో జానకిరెడ్డికి ఎంపీడీవో పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. తాడ్దానిపల్లి గ్రామంలో గోతులు ఏర్పడటంతో మురుగునీరు చేరుతుందని వచ్చిన ఫిర్యాదుల దృష్ట్యా గ్రామాన్ని సందర్శించి పంచాయతీ కార్యదర్శి సిద్దమ్మను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పీఆర్ ఏఈఈ శశికుమార్, పంచాయతీ కార్యదర్శులు సందీప్‌గౌడ్, కారోబార్ జాఫర్, జూనియర్ సహాయకుడు ప్రీతంనాయక్ తదితరులు పాల్గొన్నారు.

వందశాతం పన్ను వసూలే లక్ష్యం



పన్ను వసూలు చేస్తున్న కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి

మెదక్ మున్సిపాలిటీ, ఫిబ్రవరి 28(ఆంధ్రజ్యోతి): వందశాతం పన్ను వసూలే లక్ష్యంగా ముందుకెళ్తున్నట్లు మెదక్ మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం ఆయన క్షేత్రస్థాయిలో పన్ను వసూలు చేశారు. బిల్ కలెక్టర్లు, రెవెన్యూ ఆఫీసర్‌లతో పాటు వార్డు అధికారులు కూడా పన్ను వసూలు చేయాలని ఆదేశించారు. రూ.5.41 కోట్లకు గాను ఇప్పటివరకు రూ.3.24 కోట్లు వసూలు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ జానయ్య, ఆర్‌వో భవాని, బిల్ కలెక్టర్లు అంకితారెడ్డి, భాస్కర్‌రెడ్డి, నాగేందర్, మహేష్ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన



సబ్ స్టేషన్ ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్థులు

చేగుంట ఫిబ్రవరి 28 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోక మండల పరిధిలోని కర్నాల్‌పల్లిలో నిత్యం విద్యుత్ సరఫరాకు అంతరాయం జరుగుతుందని గ్రామస్థులు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సబ్‌స్టేషన్ ఎదుట ఆందోళన చేపట్టి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు .గ్రామానికి విద్యుత్ సరఫరా చేసే 25 హెచ్‌పీ ట్రాన్స్‌ఫార్మర్‌పై లోడ్ అధికమవ్వడంతో ప్రతీ రోజు ఉదయం ట్రిప్ ఏర్పడి సరఫరా నిలిచిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈ భరత్‌ను వివరణ కోరగా రెండు మూడు రోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు.